
సాక్షి ఒడిశా

సోమవారం । 1 । జూలై । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 1,55,627

బంగారం: 27 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరి



దూసుకొచ్చిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పరిహారం చెల్లించాలని బాధిత కుటుంబ సభ్యులు రాస్తారోకో చేపట్టారు.

- 8లో



శ్మశానవాటిక అభివృద్ధికి..

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఇచ్చాబతిగుడ శ్మశానం పునరుద్ధరణకు యువత రంగంలోకి దిగింది. అన్ని సౌకర్యాలు కల్పించారు.

- 8లో

న్యూస్‌రీల్

అనాథకు అంత్యక్రియలు



వృద్ధుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కేంద్రంలో కొన్నాళ్లుగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్న ఓ అనాథ వృద్ధుడు అనారోగ్యానికి గురి కావడంతో స్థానికులు ఈ నెల 19న చిత్రకొండ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వృద్ధుడి వివరాల కోసం ఆరా తీసిన ప్రయత్నం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో పరిస్థితి విషమించడంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆదివారం వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



అభినందిస్తున్న ఎస్పీ హరీష్

రాయగడ: ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ హరీష్ ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని సేవలందించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.ఆర్.మహంతి, ఎస్‌ఐలు సి.బెహరా, ఆర్‌ఎస్ బాగ్, ఎ.కె.రౌత్, జీసీహెచ్ నాయక్, కానిస్టేబుల్ హెచ్.నాయక్ ఉన్నారు.

బాల కార్మికులకు విముక్తి



ఆరా తీస్తున్న అధికారులు

కొరాపుట్: నబరంగపూర్ జిల్లా కేంద్రంలోని దసరాపాద ప్రాంతంలో పనిలో ఉన్న ముగ్గురు బాలికలకు అధికారులు విముక్తి కల్పించారు. ఇక్కడ జరుగుతున్న పీహెచ్‌డీ విభాగం భూగర్భ పైపులైన్ పనుల్లో నాలుగు రోజులుగా ముగ్గురు బాలికలు పని చేస్తున్నారు. వీరిని గమనించిన స్థానికులు శిశు సంరక్షణ విభాగంలో ఫిర్యాదు చేశారు. వెంటనే శిశు సంక్షేమ, కార్మిక, పోలీసు తదితర శాఖలు తనిఖీలు చేపట్టి బాలికలను గుర్తించారు. వీరంతా బొరిగుమ్మ సమితికి చెందిన వారిగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ బాలికల ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లే దారిలోనే బాలకార్మికులు పనిచేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

బాలల హక్కులు పరిరక్షించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

కొరాపుట్: బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యతని కొరాపుట్ జిల్లా అదనపు కలెక్టర్ లగ్నజిత్ రౌత్ అన్నారు. శనివారం రాత్రి కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో గ్రామీణ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అన్నపూర్ణ కుందు మాట్లాడుతూ మిషన్ స్టేట్‌మెంట్, బాలల సంరక్షణ, బాలల హక్కులు, రక్షణ, బాల్య వివాహాలు, బాల కార్మికులు, డ్రాపౌట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కో ఆర్డినేటర్ ప్రసన్న మిశ్రా మాట్లాడుతూ తాము బాల్య వివాహాలను అడ్డుకున్న తీరును వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎస్‌కే బెహరా, ఏడీఎం (మెడికల్) ఎన్ఎం సత్పతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ గాయత్రి పాత్రో, అదనపు కార్మికాధికారి బులశ్రీ, అదనపు జిల్లా సంక్షేమాధికారి దివ్యా బిస్వాల్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ సబితా సమాదార్ తదితరులు పాల్గొన్నారు.

మూలవిరాట్లకు.. మృదువైన పూత

- నిశ్శబ్ద వాతావరణంలో 'చొక్కా విజే నేడు
- దశ మూలికల ఔషధం తయారీ
- నేటి నుంచి తులసి సేవ



స్నాన అనంతరం మూల విరాట్లు

భువనేశ్వర్: భారీగా స్నానం ఆచరించి అస్వస్థతకు గురైన జగన్నాథుడు నిశ్శబ్ద వాతావరణంలో వైద్య ఉపచారాలు పొందుతున్నాడు. ఆదివారంతో తొమ్మిది రోజులు గడిచాయి. అనవసర మండపంలో మంచం పట్టిన స్వామివారి ఆరోగ్యం పదో రోజుకు కాస్త కుదుటపడింది. మెల్లగా లేచి కూర్చునే క్రమంలో సుతి మెత్తగా స్వామికి తైల మర్దన చేయాలి. దీని కోసం ఉపచారకులు ఔషధ గుణాలు కలిగిన ప్రత్యేక తైలం సంగ్రహిస్తారు. శుద్ధమైన నువ్వుల నూనెలో సాంబ్రాణి కలిపి దీనిని తయారు చేస్తారు. మృదువుగా మర్దన చేయడంతో స్వామి అస్వస్థత నుంచి కోలుకుని మర్నాడు ఆసీనుడు కావడాన్ని చొక్కా విజేగా పేర్కొంటారు. పదో రోజు సోమ వారం ఆలయంలో ఈ చొక్కా విజే సేవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అంతటా నిశ్శబ్దం..

శ్రీ మందిరం లోపలి ప్రాంగణం జయ - విజయ ద్వారం ఆవరణలో అనవసర మండపంపై నిశ్శబ్ద పరిసరాల మధ్య గోప్య వైద్య, చికిత్స సేవాదులతో స్వామి క్రమంగా కోలుకుంటున్నాడు. అస్వస్థతకు స్వామి గురి కావడంతో శ్రీ మందిరం పరిసరాల్లో భాజాభజంత్రీలు, మేళతాళాలు, ఘంటానాదాలు, సంకీర్తనలు వంటి కార్యకలాపాలు నివారించారు. 56 రకాల నైవేద్యాలు పొందే స్వామికి పత్యం నైవేద్యాలతో సరిబెడుతున్నారు. పాలు, మీగడ, వెన్న, మామిడి, అరటి, పనస వంటి ఫలాదులతో కూడిన తేలికపాటి నైవేద్యాల్ని నివేదిస్తున్నారు. దైతపతులు ఈ కార్యకలాపాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. స్వామికి నివేదించిన పదార్థాలు బయటకు తీసుకుని రాకూడదనే ఆచరణ కొనసాగుతోంది. స్వామికి గోప్యంగా వైద్య, చికిత్స సేవాదులు అందిస్తున్న దైతపతులు వీటిని సేవిస్తారు. మిగిలిన పదార్థాల్ని గోప్య మండపం ప్రాంగణంలో విడిచిపెడతారు. శ్రీ మందిరం జగమోహన మండపం నుంచి అనవసర మండపం వరకు నిషేధిత ప్రాంగణంగా పరిగణిస్తారు.



దశ మూలికల ఔషధ గుళికలు తయారు చేస్తున్న కవిరాజు వైద్య సేవకులు

ఔషధం తయారీ..

సంప్రదాయం ప్రకారం స్వామి చికిత్స కోసం కవిరాజు వర్గీయులు దశ మూలికల ఔషధం సిద్ధం చేస్తున్నారు. ఈ మహౌషధం ఆయుర్వేద పద్ధతులు, శాస్త్రీయ రీతులతో తయారు చేస్తున్నారు. ఏకాదశి తిథి నాడు అనారోగ్యంతో ఉన్న మూల విరాట్లకు దశ మూలికల గుళికల్ని ఔషధంగా వినియోగించడం ఆనవాయితీ. దీనిని తయారు చేయడానికి ముందు ఔషధీయ వన మూలికలు సంగ్రహించారు. శ్రీమందిరంలోని వైద్య యోగ్యత కలిగిన కవిరాజ సేవకులు తరతరాలుగా భగవంతునికి దశ మూలికల ఔషధం తయారీ సేవలో నిమగ్నమై ఉన్నారు. కవిరాజమాన్ ప్రకారం, ఈ మోదకం శాలపర్ణి, గంభారి, లవంగం, కృష్ణ పర్ణి, మారేడు, ఖనిబతు, పాటలీ, ఖువా, శుద్ధ నెయ్యి, తేనె, పాల మీగడ వంటి ఔషధ గుణాలు కలిగిన పదార్థాలతో దశ మూలికల ఔషధం తయారు చేస్తున్నారు. ఒంటి పూట భోజనం వంటి నియమనిష్ఠలు, భక్తిశ్రద్ధలతో కవిరాజు వర్గీయులు స్వామి కోసం ఔషధం తయారు చేయడంలో నిమగ్నమై ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మహౌషధిలో 3 కిలోల కంటే ఎక్కువ వన మూలికలు ఉపయోగిస్తారు. ఈ అరుదైన వన మూలికలు భక్తులు, కొన్ని ఆయుర్వేద మందుల దుకాణాల నుంచి సేకరించారు. ఈ మోదకం ధన్వంతరియు ఆయుర్వేద గ్రంథాల ఆధారంగా తయారు చేశారు. సీనియర్ దైతపతి విశ్వబాసు బినాయక్ దాస్ మహా పాత్రో ఫులురి తైల చికిత్సతో స్వామి కాస్త కోలుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి తులసి వినియోగం..

స్వామి అస్వస్థతకు గురి కావడంతో పూజాదుల్లో తులసి వినియోగం నివారించారు. నిత్యం తులసి లేకుండా తెల్లని పూలతో పూజించారు. దశ మూలికల ఔషధం వినియోగం నుంచి స్వామికి తులసి సమర్పణ పునఃప్రారంభం కానుంది.

దుకాణంలోకి దూసుకెళ్లిన బొలెరో



ఘటనా స్థలంలో వాహనం

రాయగడ: బొలేరొ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ కిరాణా దుకాణంలోకి దూసుకెళ్లిన ఘటన కాసీపూర్ సమితి పొడాపొడి గ్రామ శివారులొ శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దుకాణ యజమాని పంచానన్ బెహరా తీవ్ర గాయాలు కావడంతో కాశీపూర్ ఆస్పత్రికి తరలించారు. టికిరి నుంచి పొహండి వైపు వస్తుండగా అదుపు తప్పడంతో వాహనం ప్రమాదానికి గురైందని పోలీసులు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

శ్రీక్షేత్రానికి రథయాత్ర శోభ



శోభాయమానంగా శబరి శ్రీక్షేత్రం



రంగు రంగుల విద్యుత్ కాంతులతో ఆలయం

కొరాపుట్: దక్షిణ ఒడిశా పూరీ ధామ్‌గా పిలిచే కొరాపుట్‌లోని జగన్నాథ శబరి శ్రీక్షేత్రం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. ఎప్పుడు ధవళ వర్ణంతో ఆకట్టుకునే ఈ దేవాలయం జగన్నాథ రథయాత్ర సందర్భంగా రంగు,రంగుల విద్యుత్ కాంతులు ఏర్పాటు చేయడంతో భక్తులకు కనువిందు చేస్తోంది.

జయహో భారత్!



బందారు మందిరం వద్ద భారత పతాకాలతో యువత

కొరాపుట్: టీ-20 ప్రపంచ కప్ విజేతగా భారత్ నిలవడంతో అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో శనివారం అర్ధరాత్రి యువత హంగామా చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం బందారు ఘరణి మందిరం వద్ద భారత పతాకాలు ఎగుర వేసి సందడి చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు.ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

రథయాత్రకు 315 ప్రత్యేక రైళ్లు



జోనల్, మండల అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అశ్విని వైష్ణవ్

- 15 లక్షల మంది ప్రయాణికులకు ఏర్పాట్లు
- రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్రకు విచ్చేసే భక్తుల కోసం 315 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఆదివారం పూరీ రైల్వే స్టేషన్‌ను సందర్శించి రథయాత్ర సమయంలో యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో వివిధ గమ్యస్థానాలకు ఈ రైళ్లు అనుసంధానపరుస్తామని చెప్పారు. ఒడిశాలోని ప్రతి ప్రాంతం నుంచి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రద్దీ నిర్వహణ, రైలు సమాచార వ్యవస్థ, మొబైల్ టికెట్ కౌంటర్లు, యాత్రికుల నిరీక్షణ ప్రాంతం, 25 వేల మందికి పైగా యాత్రికులు, భక్తులకు వసతి కల్పించడానికి మేళా షెడ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది 15 లక్షల మంది ప్రయాణికులను పూరీ నుంచి గమ్యస్థానాలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇది కాకుండా, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత డైనమిక్ షెడ్యూలింగ్ సిస్టమ్ ఉపయోగించి ప్రత్యేక రైళ్లు నడుపుతామని, రద్దీకి తగ్గట్లు మరిన్ని రైళ్లను నడిపిస్తామని మంత్రి తెలిపారు.

శిశు మరణాలపై అధ్యయనం



నారాయణపట్నలో అధ్యయనం చేస్తున్న వైద్య బృందం

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో సంభవిస్తున్న శిశు మరణాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర వైద్య బృందం రంగం లోకి దిగింది. నారాయణపట్న, బందుగాం సమితులలో రెండు వారాల వ్యవధిలో 9 మంది శిశువులు అనారోగ్యంతో మృతి చెందగా.. డిఫ్తీరియా వ్యాధిగా ప్రచారం జరుగుతోంది. అయితే వ్యాధి నిర్ధారణ సరైన ఆధారాలు లేవని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మృతుల నివాసాలకు వెళ్లి వివరాలు సేకరించారు. పరిశీలనలో రాష్ట్ర చైల్డ్ హెల్త్ డైరెక్టర్ ఆదిత్య మహాపాత్రో, యూనిసెఫ్ ప్రతినిధి అనిల్ పట్నాయక్, ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్, వైద్య కళాశాల నిపుణులు పాల్గొన్నారు.

• గురుదేవోభవ..!



ఉపాధ్యాయుడి పాదాలకు నమస్కరిస్తున్న మంత్రి నిత్యానంద గోండో

తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదపూజ చేసి రుణం తీర్చుకున్నారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో. తాను చదివిన విద్యాలయం యాజమాన్యం కోరిక మేరకు సన్మాన సభకు హాజరైన మంత్రిని ముందుగా ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కూడా ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించారు. తాను రాష్ట్రానికి మంత్రినైనా నిత్య విద్యార్థినేనని స్పష్టం చేశారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి కారణంగా ఇక్కడ అందిన విద్యేనని ప్రకటించడంతో సభ మొత్తం హర్షధ్వానాలు, కరతాళ ధ్వనులతో మారుమోగింది.

- కొరాపుట్

ప్రభుత్వ కొత్త ప్రముఖ కార్యదర్శిగా.. మనోజ్ ఆహుజా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన మనోజ్ ఆహుజా

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రముఖ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి మనోజ్ ఆహుజా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఒడిశా కేడర్‌కు చెందిన 1990-బ్యాచ్ ఐఏఎస్ అధికారి. స్థానిక లోక్‌సేవా భవన్‌లో ఉద్యోగ విరమణ పొందిన చీఫ్ సెక్రటరీ, 1989 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ కుమార్ జెనా నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కొత్త ప్రముఖ కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రం డిప్యుటేషన్‌లో కొనసాగిన మనోజ్ ఆహుజా స్వరాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఇంతకు ముందు, ఆయన వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖలో కార్యదర్శిగా పని చేశారు. కేంద్రంలో సిబ్బంది శిక్షణ, సాధారణ పాలన విభాగం సంయుక్త డైరెక్టర్‌గా, ఒడిశాలోని ఉక్కు, గనులు, క్రీడలు - యువజన వ్యవహారాల విభాగాల్లో కమిషనర్, కార్యదర్శిగా అనేక పదవులు నిర్వహించారు. కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు (సీబీఎస్‌ఈ) చైర్మన్‌గా కూడా పని చేశారు.

కొరాపుట్ జిల్లాతో అనుబంధం..

కొరాపుట్: రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన మనోజ్ ఆహుజాకు కొరాపుట్ జిల్లాతో అనుబంధం ఉంది. ఈయన గతంలో కొరాపుట్ జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పని చేశారు. అదే సమయంలో మనోజ్ సతీమణి హారతి ఆహుజా కూడా కొరాపుట్ జిల్లా అదనపు కలెక్టర్‌గా సేవలందించారు. అనంతరం వీరిద్దరూ పదోన్నతులపై కొరాపుట్ నుంచి వెళ్లిపోయారు. సుమారు మూడు దశాబ్దాల అనంతరం చీఫ్ సెక్రటరీగా మనోజ్ బాధ్యతలు చేపట్టారు.

విమాన సేవలు విస్తరించాలని వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

జయపురం: కొరాపుట్ జిల్లా జయపురం నుంచి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ వరకు 72 సీట్ల విమానాన్ని నడపాలని జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయపురంలో 1962లోనే విమానాశ్రయం నెలకొల్పారని గుర్తు చేశారు. 1980లో భువనేశ్వర్ నుంచి జయపురం మీదుగా విశాఖపట్నం వరకు 19 సీట్ల వాయుధూత్ నడిచేదని, తర్వాత సర్వీసు నిలిపివేశారని పేర్కొన్నారు. 2023 నుంచి భువనేశ్వర్ నుంచి జయపురం మీదుగా విశాఖపట్నం వరకు 9 సీట్ల విమానాన్ని నడుపుతున్నా ప్రయోజనం ఉండటం లేదన్నారు. రన్‌వేను విస్తరించి 72 సీట్ల విమాన సౌకర్యం కల్పించాలిన విన్నవించారు. కార్యక్రమంలో సంఘ సాధారణ కార్యదర్శి డి.మాధవ, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, డైరెక్టర్ గెంబలి వసంతరావు పాల్గొన్నారు.

త్వరలోనే రత్న భాండాగారం తెరుస్తాం



మాట్లాడుతున్న సీఎం మాఝీ

- బీజేపీ సభ్యుల సన్మాన సభలో సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: పూరి జగన్నాథ ఆలయ రత్న భాండాగారాన్ని అతి త్వరలోనే తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలను సన్మానించేందుకు ఆదివారం స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండులో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ జగన్నాథుని రత్న బాంఢాగారానికి సంబంధించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జగన్నాథునితో సహా బలభద్రుడు, దేవీ సుభద్ర ఆభరణాలు లెక్కింపు, బరువు, విలువ తదితర అంశాల్ని పరిశీలించి సమగ్ర జాబితా సిద్ధం చేస్తామన్నారు. మంత్రి మండలి తొలి సమావేశంలోనే జగన్నాథ ఆలయాన్ని సమర్థంగా నిర్వహించేందుకు బీజేపీ ప్రభుత్వం రూ.500 కార్పస్ నిధిని ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఖనిజాలను దోచుకుని పర్సంటేజీలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. మహిళలు, రైతులు, యువకులు, ఆదివాసీలు, దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యతనివ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.



సభకు హాజరైన ప్రజలు

క్లుప్తంగా

బాలల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న సుమన్ జెనా

జయపురం: జయపురం సమితి పంపుణీ గ్రామంలో కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం శిశు సురక్షా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెనా, కొరాపుట్ జిల్లా సురక్షా అధికారి రాజశ్రీ దాస్, హెచ్‌ఎం బాలకృష్ణ చౌదరి, ఉపాధ్యాయులు సుమనీ మహారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యసేవలు


విద్యార్థినులతో నిర్వాహకులు

రాయగడ: రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్ట్ హాస్టల్లో ఉంటున్న పేద ఆదివాసీ విద్యార్థినులకు ఆదివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి ఏడీఎం డాక్టర్ మమత చౌదరి నేతృత్వంలో 80 మంది బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాతారావు

కోటబొమ్మాళి : జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఎత్తురాళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పురిటి తాతారావు (42) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోటబొమ్మాళి పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. టెక్కలి మండలం రావివలస పంచాయతీ దామోదరపురం గ్రామానికి చెందిన పురిటి తాతారావు, కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడు గ్రామానికి చెందిన యండ నర్సింహమూర్తిలు ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్నారు. వీరిరువురూ ఆదివారం నరసన్నపేటలో పనిచూసుకుని టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎత్తురాళ్లపాడు వచ్చేసరికి వెనుకగా వస్తు న్న డీసీఎం వ్యాను ఒక్కసారిగా ఢీకొట్టడటంతో రోడ్డుపై ఇద్దరూ పడిపోయారు.

అదే సమయంలో అటుగా వస్తున్న మరో గుర్తు తెలియని వాహనం అతివేగంతో రోడ్డుపై పడి ఉన్న తాతారావుపైనుంచే కాక నర్సింహమూర్తి ఎడమచేతి మీద నుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే తాతారావు మృతిచెందగా, నర్సింహమూర్తి చేయి నుజ్జునుజ్జయిపోయింది. స్థానికులు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి నర్సింహమూర్తిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుటుంబానికి తానే ఆధారం..

మృతుడు తాతారావుకు భార్య స్వాతి, కుమారుడు రాకేష్‌లతో పాటు తల్లిదండ్రులు శీనమ్మ, చిన్నవాడు ఉన్నారు. కుటుంబం మొత్తం తాతారావు జీతంతోనే జీవనం సాగిస్తున్నారు. ఘటనా స్థలి వద్ద తాతారావు భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదించారు. తాతారావు మృతితో కుటుంబం రోడ్డున పడిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటబొమ్మాళి పోలీసులు చెప్పారు. డీసీఎం వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పాము కాటుతో దివ్యాంగురాలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన గూన సరోజినమ్మ (55) అనే దివ్యాంగురాలు పాముకాటుకు గురై మృతి చెందా రు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకా రం.. మృతురాలు తన అన్నయ్య గూన జగ్గారావు తో కలసి వారి ఇంటిలో ఉంటున్నారు. అయితే శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటిలో పడుకుని ఉండగా గుర్తు తెలియని పాము కాటు వేయడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించా రు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఆటో, బైక్, బొలెరో వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి
- 10 మందికి గాయాలు
- పరిహారం చెల్లించాలని బాధిత బంధువుల రాస్తారోకో


ప్రమాదంలో నుజ్జయిన ఆటో


ఘటనా స్థలంలో బైక్


మృతదేహం వద్ద రాస్తారొకొ చేస్తున్న గ్రామస్తులు


మృతి చెందిన గణేష్


గాయపడిన శంకర్ పర్శక

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరం సమీపంలో గ్యాస్ కంపెనీ ఎదురుగా ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలొ ఇద్దరు దుర్మరణం పాలవ్వగా మరో 10 మంది గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగడ నుంచి పార్వతీపురం వైపు వెళుతున్న బొలేరో వాహనం అదుపుతప్పి బెహరగుడ నుంచి బైకుపై వస్తున్న శంకర్ పర్శక, దేవరాజ్, గణేష్‌లను ఢీకొట్టింది. అదే సమయంలో డెప్పాగుడ నుంచి ఆటోలొ పితామహల్ వైపు వెళ్తున్న ఆటో కూడా బొలేరొను ఢీకొంది. ఈ ఘటనలో బైకుపై ఉన్న గణేష్ అక్కడికక్కడే మృతి చెందగా, దేవరాజ్, శంకర్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. ఆటోలో ప్రయాణిస్తున్న డెక్కాగుడ వాసి సత్య మండంగి(28)తో పాటు 8 మంది గాయపడటంతో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్య మండంగి మృతి చెందాడు. బాధితులను రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అదే సమయంలో రాయగడ జిల్లా కలక్టర్ మనోజ్ మహాజన్ వెళుతుండగా ఘటనా స్థలం వద్ద ఆగి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

పరిహారం చెల్లించాలని ధర్నా..

బొలేరొ డ్రైవర్ తప్పిదం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని, మృతుల కుటుంబాలతో పాటు గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బెహరగుడ (మృతుడు గణేష్ స్వగ్రామం) గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. మృతదేహాన్ని ఘటనా స్థలం వద్దే ఉంచి టైర్లు తగలబెట్టి ఆందోళనకు దిగారు. దీంతో రాయగడ నుంయి ఆంధ్ర వైపు వెళ్లే వాహనాల రాకపొకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా మజ్జిగౌరి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఐఐసీ కేకేబీకే కుహరో, సిబ్బంది ఆందోళనకారులతో మాట్లాడారు. నష్టపరిహారం చెల్లించేందుకు బొలెరొ యజమాని అంగీకరించడంతో ఆందొళన విరమించచారు. ప్రమాదానికి కారణమైన బొలెరో పొరుగు రాష్ట్రమైన పార్వతీపురం పట్టణానికి చెందినదిగా పోలీసులు గుర్తించారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన


ముంపునకు గురైన ఇళ్లు


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఏడో వార్డులో వర్షం ధాటికి ముంపునకు గురైన ఇళ్లను మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి పరిశీలించారు. మల్కన్‌గిరి పట్టణంలోని బలి సాగరాన్ని కొద్ది రోజులుగా అభివృద్ధి చేస్తున్నారు. అయితే 15 అడుగుల మేర గోతులు తవ్వడంతో చెరువును ఆనుకుని ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుతోంది. ఈ విషయమై స్థానికులు తహశీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు చెబుతున్నారు. సుమారు 20 కుటుంబాల వారు ముంపునకు గురి కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం బాధితులను పరామర్శించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులను ఆదేశించారు.

చిన్నారులతో మమేకం


అరవింద ఆశ్రమంలో చిన్నారులతో నబరంగ పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: ఎన్నికల రణం ముగిసిన తర్వాత విజేతలు చిన్నారులతో మమేకమవుతూ సాంత్వన పొందుతున్నారు. శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి సార్గులిలో ఉన్న రాందాస్ అనాథ శరణాలయం సందర్శించారు. అక్కడి అనాథ చిన్నారులతో ఆనందంగా గడిపారు. మిఠాయిలు తినిపించి నిర్వాహకులను సన్మానించారు. చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఆశ్రమానికి ఏదైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలని అభయ మిచ్చారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి నందాహండి సమితి మాలిగుడ గ్రామంలోని అరవింద ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడి చిన్నారులతో సెల్ఫీలు దిగారు. ఆశ్రమాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తాని హామీ ఇచ్చారు.

వివాహితపై దాడికి యత్నం

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో కేసు రాజీ పడలేదని దారి కాచి ఓ వివాహితపై వ్యక్తి దాడి చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్‌ఐ కామేశ్వరరావు చెప్పిన వివరాల మేరకు.. గూనపాలెం పోలాడ వారి వీధి నీలమ్మతల్లి గుడి సమీపంలో నివసిస్తున్న ఓ వివాహిత బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తుంది. ఈమెకు కొన్నేళ్ల కిందటే నగరానికి చెందిన ఆకుల సురేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆ విషయం భర్తకు తెలియడంతో ఆమె సురేష్‌ను దూరం పెట్టింది. దీంతో గత ఏడాది డిసెంబరు 23న నగరంలోని ఓ చికెన్ షాపు వద్ద ఆమెపై దాడి చేయడంతో ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. దీనిపై జూన్ 29న (శనివారం) లోక్‌అదాలత్‌లో కేసు రాజీ పడేందుకు సురేష్ యత్నించినా వివాహిత అంగీకరించలేదు. అదే రోజు రాత్రి తన కుమారునికి ఫిట్స్ రావడంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి రాత్రి ఇంటికొచ్చింది. బ్యూటీ పార్లర్ సెంటర్ వద్ద తన స్కూటీ ఉండిపోవడంతో తెచ్చేందుకు వెళ్లి తిరిగి పదిన్నర గంటల సమయంలో వస్తుండగా సురేష్ ఆమెను పిలిచి గొడవ పడ్డాడు. తీవ్ర దుర్భాషలాడుతూ కాలితో తన్నాడు. బండి తీసి వెళ్లిపోతుండగా పిడిగుద్దులు గుద్దాడు. మళ్లీ రిపోర్ట్ ఇస్తే నీ సంగతి చూస్తానని బెదిరించాడని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గిరిజన హాస్టల్‌లో విద్యార్థులతో పనులు


ఫ్యాన్లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు


హాస్టర్ గదులు కడుగుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులతో హాస్టల్ పనులు చేయించడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హాస్టల్‌లో సుమారు 15 మంది ఉద్యో గులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రతి రోజు ఇద్ద రు, ముగ్గురు మినహా ఇతర ఉద్యోగులు విధులకు హాజరు కావటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థులు మూడు రోజుల కిందట కల్తీ ఆహారం తిని తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వీరు ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం బయటకు తెలియనీయకుండా హాస్టల్ ఇన్‌చార్జి జాగ్రత్త పడ్డారంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు విద్యార్థుల పరిస్థితి గుర్తించి సిబ్బంది హాస్టల్‌కు వెళ్లి పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యార్థులు పనిచేస్తున్న విషయం వీరి ద్వారానే వెలుగులోకి వచ్చింది. వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థులను పరీక్షించేందుకు హాస్టల్‌కు వెళ్లగా హాస్టల్‌లో పిల్లలు గచ్చులు కడగటం, ఊడ్చటం, మరుగుదొడ్లు కడగటం, సీలింగ్ ఫ్యాన్లు శుభ్రపర్చడం వంటి పనులు చేస్తూ కనిపించారు. ఈ సమయంలో వంట చేసే వ్య క్తి తప్ప మరెవ్వరు హాస్టల్‌లో లేరు. ఆరోగ్య సిబ్బంది ఇక్కడి పరిస్థితిని వారి పై అధికారులకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. ఇంతలో ఆరోగ్య సిబ్బంది, మీడియా వచ్చిన విషయాన్ని తెలుసుకున్న హాస్టల్ వార్డెన్, మరో ఉపాధ్యాయుడు అక్కడికి చేరుకుని వీడియోలు, ఫొటోలు తీస్తున్న వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫొటోలు బయటకు వెళ్లినా, వార్తలు వచ్చినా పరిస్థితి తీవ్రంగా ఉంటుందని మీడియా ప్రతినిధులకు హెచ్చరించారు. వివరణ ఇచ్చేందుకు, వారి పేర్లు చెప్పేందుకు కూడా నిరాకరించారు. అప్పటి వరకు ప్రతి రోజు తమతో పనులు చేయిస్తున్నారని చెప్పిన విద్యార్థులు వార్డెన్ వచ్చిన తర్వాత భయపడి మాట మార్చేశారు. ఆదివారం పనివారు రాకపోవటంతో తాము ఈ పనులు చేస్తున్నామని అన్నారు.

జయపురం అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే బాహిణీపతిని సన్మానిస్తున్న సిటిజన్ కమిటీ సభ్యలు

జయపురం: జయపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హ్యాట్రిక్ విజేత, ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సిటిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సిటిజన్ కమిటీ కార్యాలయంలో అధ్యక్షుడు మీణకేతన దాస్ అధ్యక్షతన ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహిణీపతి మూడో సారి జయపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ జ్ఞానేంద్రకుమార్ మహంతి, గీతాప్రకాశ్ మిశ్రా, సిటిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీలో కొరాపుట్ ఎంపీ ఉల్క



ఉల్కను ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కకు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పరాజయం పాలైంది. అక్కడ ఓటమికి గల కారణాలు గుర్తించాలని ఏఐసీసీ సప్తగిరి ఉలకను ఆదేశించింది. ఈ మేరకు ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఉల్కతో పాటు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహన్, గుజరాత్‌కు చెందిన జిగ్నేష్ జిగాన్‌లు ఉన్నారు. వీరంతా ఆదివారం భోపాల్ చేరుకొని పార్టీ నేతల వివరణలు తీసుకున్నారు.

రూ.30 లక్షల విలువైన గంజాయి స్వాధీనం


పోలీసులకు పట్టుబడిన గంజాయి బస్తాలు


గంజాయితో పట్టుబడిన నిందితులు

జయపురం: జయపురం సదర్ పోలీసులు దాదాపు రూ.30 లక్షల విలువైన 297 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి ఆదివారం వెల్లడించారు. శనివారం రాత్రి సదర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పాత్రోపుట్ సమీపంలో అతి వేగంగా వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందని తెలిపారు. కొరాపుట్ పోలీసుస్టేషన్ పరిధిలోని బొడొకెరంగ గ్రామానికి చెందిన రాజేష్ ఖిలోను అరెస్టు చేసినట్లు చెప్పారు. లమతాపుట్ సమితిలోని మారుమూల గ్రామాల్లో గంజాయి కొనుగోలు చేసి బీహార్‌కు తరలిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రపూర్‌లో గంజాయి స్వాధీనం

రాయగడ: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 26 కిలొల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం చంద్రపూర్ పోలీసులు కిరమ్ కూడలిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. రెండు సంచుల్లో 26 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్, రూ.390 నగదును నిందితుల నుంచి స్వా. దీనం చేసుకున్నారు.

కృష్ణచంద్ర మృతి తీరని లోటు


శ్రద్ధాంజలి ఘటిస్తున్న జర్నలిస్టులు

జయపురం: సీనియర్ జర్నలిస్టు, రచయిత కృష్ణ చంద్ర సాహు(రుతు) మరణం తీరని లోటని ఉత్కళ జర్నలిస్ట్స్ యూనియన్ (ఓజేయూ) కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రథొపాడియలో సాహు సంతాప సభ ఏర్పాటు చేశారు. పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై సాహు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నవరంగపూర్ ఓజేయూ అధ్యక్షుడు హృషికేష్ మిశ్రా, జర్నలిస్టులు రబి నాయిక్, మనోజ్ దాస్, రాజేంద్ర గౌడ, సంతోష్ దాస్, గజేంద్ర సాహు, పి.గోపాలరావు, హేమంత పాణిగ్రహి, కమల భొత్ర తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి మేముసైతం..


విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


షెడ్ పునరుద్ధరణ


ముళ్లపొదలు తొలగిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఇచ్చాబతిగుడ శ్మశానం పునరుద్ధరణకు యువత రంగంలోకి దిగింది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ శ్మశానవాటికలో వెలగని విద్యుత్ లైట్లు, అడవిని తలపించే ముళ్ల పొదలు, అధ్వాన కాలిబాటలు, నీటి వసతి లేక ఇబ్బందుల నడుమ అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతుల కుటుంబ సభ్యులు అవస్థలు పడేవారు. విషయం తెలుసుకున్న ఐకాన్స్ ఇన్ మోషన్ యువజన సంస్థ సభ్యులు ముందుకొచ్చారు. జేసీబీతో పరిసరాలను శుభ్రం చేసి సకల సౌకర్యాలు కల్పించారు. ప్రతి వ్యక్తికి అంతిమ వీడ్కోలు ఘనంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టాలని సంస్థ ప్రతినిధి రిక్కి త్రిపాఠి తెలిపారు.

క్లుప్తంగా

నదిలో గల్లంతైన వ్యక్తి మృతి


కలియ దాసు మృతదేహం

కొమరాడ: జంఝావతి రబ్బర్ డ్యామ్ సమీపంలో స్నానం కోసం దిగి నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో ఒకరు మునిగిపోయి మృతి చెందాడని ఎస్సై కె. నీలకంఠం తెలిపారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గరుడుబిల్లి గ్రామానికి చెందిన కలియ దాసు (60) చినఖేర్జిల పంచాయతీ బూర్జివలస గ్రామ సమీపంలో ఉన్న క్వారీలో కూలి పని చేస్తున్నాడు. శనివారం ఉదయం స్నానం కోసం నదికి వెళ్లిన దాసు ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయాడు. ఆదివారం ఉదయం రబ్బర్‌డ్యామ్ సమీపంలో మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబసభ్యులకు సమచారం ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడ మీద నుంచి పడి ఒకరి మృతి


హేమసుందర్ (ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని తారకరామా కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఎన్నా బాబు కుమారుడు హేమసుందర్ (32) విశాఖలో మేడ మీద నుంచి జారిపడి శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఓ భవనానికి ఏసీ బిగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ పడిపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో తారకరామా కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీ నాయన ఆదివారం ఉదయం కాలనీకి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడికి రెండున్నరేళ్ల లోపు వయసున్న ఇద్దరు కుమారులున్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు


గాయాలపాలైన కల్యాణి

పార్వతీపురం టౌన్/సీతానగరం : లారీ ఢీ కొని మహిళకు గాయాలైన సంఘటన ఆదివారం సీతానగరం మండల కేంద్రలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బలిజిపేట మండలం అజ్జాడ గ్రామానికి చెందిన గోపిశెట్టి కల్యాణి కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామానికి వెళ్లేందుకు ఆటోపై సీతానగరం వచ్చింది. అక్కడ మరో వాహనం ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా.. లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు తక్షణమే స్పందించి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

తెలుగు సాహితీ శిఖరం శ్రీనాథుడు

రాజాం సిటీ: తెలుగు సాహితీ శిఖరం శ్రీనాథుడని.. ప్రముఖ సాహితీవేత్త నేతేటి గణేశ్వరరావు కొనియాడారు. స్థానిక వేదగాయత్రి జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాజాం రచయితల వేదిక 113వ సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన 'శ్రీనాథుని కవిత్వం విహంగ వీక్షణం' అనే అంశంపై ప్రసంగించారు. శ్రీనాథుడు శృంగార నైషధం, హరవిలాసం వంటి దాదాపు 14 గొప్ప రచనలు చేశాడని.. ఏ వయసులలో, ఏ కాలంలో ఆయన ఏయే రచనలు చేశారో వరసక్రమంలో తెలిపారు. అతని సాహిత్యం అతని మూర్తిమత్వాన్ని పట్టి ఇస్తుందని, అంతేకాకుండా 14వ శతాబ్దపు చరిత్ర కూడా శ్రీనాథ సాహిత్యాన్ని చదివిన వారికి అవగతమవుతుందన్నారు. శ్రీనాథుని చాటువులు పద్య సౌందర్యానికి, కవితాధారకు నిదర్శనాలన్నారు. శ్రీనాథ సీసాలు అనే ప్రత్యేక ముద్ర అతనికే ఉందన్నారు. శ్రీనాథుని రచనల స్ఫూర్తితో ఎంతోమంది యువ కవులు, రచయితలు ముందుకురావాలని కోరారు. గణేశ్వరరావును వేదిక సభ్యులు సత్కరించారు. డాక్టర్ ఆల్తి మోహనరావు, వేదిక నిర్వాహకులు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ల్లో మిగులు సీట్ల భర్తీకి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి తెలిపారు. తొలివిడతలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా మిగులు సీట్లకు రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 25వ తేదీ సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తు చేసుకున్న ఐటీఐ కళాశాలకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయించుకోవాలని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9849118075, 9849944654, 7780658035 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైద్యో నారాయణో హరి..


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగిని పరిక్షిస్తున్న వైద్యుడు


శిశువును పరీక్షిస్తున్న వైద్యురాలు

- పునర్జన్మనిస్తున్న వైద్యులు
- విపత్కరకాలంలోనూ వెరవకుండా సేవలు
- వైద్య వృత్తిపై పెరుగుతున్న ఆసక్తి
- నేడు డాక్టర్స్ డే

విజయనగరం ఫోర్ట్: తల్లిదండ్రులు జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మ ఇస్తారు.. అందుకే వైద్యులను భగవంతుడితో పోలుస్తూ వైద్యో నారాయణో హరి అంటారు. ప్రాణాలను నిలబెట్టగలే శక్తి వైద్యుల చేతుల్లోనే ఉంటుంది. అందుకే వారి సేవలకు సలామ్ కొట్టాల్సిందే. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వెరవకుండా ధైర్యంగా వైద్య సేవలు అందించేది వారే. రెండేళ్ల కరోనా విలయతాండవం చేసినా ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించిన వైద్యులను ఎంత పొగిడినా తక్కువే. సోమవారం వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

సవాళ్లను అధిగమిస్తున్న వైద్యులు..

వైద్యరంగంలో అనుకోకుండా వస్తున్న సవాళ్లను వైద్యులు అధిగమిస్తున్నారు. గతంలో ప్రజలను ఎక్కువగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, డయేరియా, టైఫాయిడ్, టీబీ, హెచ్‌ఐవీ వంటి వ్యాధులు బాధించేవి. అటువంటి రోగాలను వైద్యులు నియంత్రణలోకి తీసుకువచ్చారు. ఇటీవల కరోనా, బ్లాక్ ఫంగస్, డెల్టా వేరియంట్ వంటి కొత్త కొత్త జబ్బులు వ్యాప్తి చెందాయి. వీటిని వైద్యులు సమర్థవంతంగా నియంత్రిస్తున్నారు.

వైద్య విద్యపై ఆసక్తి..

వైద్య వృత్తి గౌరవప్రదమైనది కావడంతో చాలా మంది ఈ వృత్తిని చేపట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. డాక్టర్ కోర్సు పూర్తి చేస్తే అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ పరంగా మెరుగైన అవకాశాలు ఉండడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు.

600 మంది వరకు వైద్యులు..

జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 7 సీహెచ్‌సీలు, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, 300 వరకు ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. వీటిల్లో సుమారు 600 మంది వరకు వైద్యులు పనిచేస్తున్నారు. ఇదిలా ఉంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగం బలోపేతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. వైద్యవిధాన్ పరిషత్, వైద్యారోగ్య శాఖ, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులన్నీ భర్తీ చేసింది.

సేవాభావం తప్పనిసరి..



ఓపిక, సహనం ఉంటేనే వైద్య వృత్తిని చేపట్టాలి. సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి. సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచడడానికి వైద్యులు కృషి చేయాలి. ఆధునాతన వైద్య సేవలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.

– ఎం. జయచంద్రనాయుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

గౌరవప్రదంగా మెలగాలి..



సమాజంలో వైద్యులు గౌరవప్రదంగా మెలగాలి. వైద్యులను ప్రోత్సహిస్తే వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. వైద్యులపై ఒత్తిడి తీసుకురాకూడదు. ఒత్తిడి లేకుండా ఉంటే మెరుగైన వైద్య సేవలు అందించగలరు.

డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్ , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

వైద్య వృత్తి ఉన్నతమైనది..



వైద్య వృత్తి ఉన్నతమైనది. ప్రజలు డాక్టర్‌ని గౌరవించాలి. అదే సమయంలో వైద్యం కోసం వచ్చే రోగులతో ప్రేమగా, అప్యాయంగా మాట్లాడి సేవలందించాలి. వైద్య వృత్తిని చేపట్టినందుకు అదృష్టంగా భావించాలి. ప్రతి రోగిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి.

– డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్ఓ

వైద్యుడు ఆరోగ్య ప్రదాత..

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు



సత్కారం పొందిన వైద్యులతో నిర్వాహకులు

విజయనగరం: సమాజంలో వైద్యుడు ఆరోగ్య ప్రదాతగా వెలుగొందుతున్నాడని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కంటోన్మెంట్‌లో గల గురజాడ విద్యా సంస్థలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణాపాయంలో ఉన్నవారికి సరైన చికిత్స చేసి ప్రాణాలను కాపాడే వైద్యులను భగవంతుడితో సమానంగా గౌరవిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారని తెలిపారు. యూరాలజిస్ట్ శ్రీకాంత్ జాడా, ఆర్థోపెడీషియన్ భూపతి మాట్లాడుతూ.. మందులు రోగాలను నయం చేస్తాయి గాని.. వైద్యులు మాత్రమే రోగులను నయం చేయగలరన్నారు. గైనకాలజిస్ట్ జి. సన్యాసమ్మ మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం పణంగా పెట్టి కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన ఘనత వైద్యులకే దక్కుతుందన్నారు. సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, సుభద్రదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, రచయిత కాగుపాటి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

- ఇద్దరికి గాయాలు

భోగాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం గ్రామానికి చెందిన చిన్నయ్య, రమేష్ అనే ఇద్దరు యువకులు తమ సొంత పనుల నిమిత్తం బైక్‌పై భోగాపురం బయలుదేరారు. ఈ క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకునేసరికి డెంకాడ మండలం బంటుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో చిన్నయ్య, రమేష్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

వేపాడ : మండలంలోని వీలుపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు వల్లంపూడి ఏఎస్సై వెంకటేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పత్రి వెంకటరావు కుళాయిలు సరిగా రావడం లేదని శనివారం రాత్రి సర్పంచ్ ఇంటికి వెళ్లి దుర్భాషలాడాడు. దీంతో సర్పంచ్ భర్త ఎస్. అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో క్వారీ తగవుపై స్టేషన్‌లో శనివారం కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఇంటికి వెళ్లిపోయామని.. రాత్రి ఇంటిలో భోజనం చేస్తుండగా గ్రామానికి చెందిన ఎస్.అప్పారావుతో పాటు మరో ముగ్గురు వచ్చి తనపై దాడి చేశారని పత్రి వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పత్రి వెంకటరావు ప్రస్తుతం ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయన నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు.

అంగ వైకల్యాన్ని అధిగమించి..

- సొంత ఆలోచనలతో ఆర్థికంగా అభివృద్ధి
- సామాజిక సేవలో ముందంజ
- ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగులైన అన్నదమ్ములు


మిల్క్ డెయిరీ నిర్వహిస్తున్న రామునాయుడు

గుర్ల: వారి దీక్ష, పట్టుదల ముందు అంగవైకల్యం ఓడింది. దివ్యాంగులమని మనోధైర్యం కోల్పోలేదు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి పనిచేయడానికి కుంటిసాకులు వెతుకుతున్న ఈకాలంలో దివ్యాంగులైనా అన్నదమ్ములు ఆర్థికంగా నిలదొక్కుకుని, సామాజిక సేవ చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో వైకాల్యాన్ని జయించి ఆర్థికంగా అభివృద్ధి చెంది, వచ్చిన ఆదాయంలో సగానికిపైగా సమాజ సేవకు వెచ్చిస్తున్నారు. వారే గుర్ల మండలంలోని దమరసింగి గ్రామానికి చెందిన మీసాల గోవింద్, మీసాల రామునాయుడు.

స్నేహితుల సహాయంతో చదువు..

మీసాల గోవింద చదువులో రాణించడానికి అనేక కష్టాలు పడ్డాడు. స్నేహితుల సహాయంతో ఉన్నత చదువులు చదువుతున్నాడు. బీఎస్సీ పూర్తి చేసి బ్యాంక్‌లో ఉద్యోగం సంపాదించడమే ప్రధాన లక్ష్యం. ఓ పక్క చదువుకుంటూ ఖాళీ సమయంలో ఉపాధి వేతనదారులు, మహిళలకు సీఎస్‌పీ (ఖాతాదారులు సేవా కేంద్రం) కేంద్రం ద్వారా ఆర్థిక లావాదేవీలు చేస్తూ నగదు సంపాదిస్తున్నాడు. దీంతో పాటు న్యూ జనరేషన్ అనే యూట్యూబ్ చానల్ ప్రారంభించి యువతకు, మహిళలకు అవసరమైనా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాడు. తన ఎన్‌జీ క్రియేషయన్స్ యూట్యూబ్ చానల్‌కు 2 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లున్నారు. యూట్యూబ్ వల్ల వచ్చిన నగదుతో సామాజిక సేవ చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. అలాగే పైడిమాంబ యూత్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి అనాథ చిన్నారులకు అన్నదానం చేపడుతున్నారు. ఉన్నత చదువులు చదువుకోవడానికి, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నవారికి ఆర్థికంగా సహాయం చేస్తున్నాడు.


సీఎస్‌పీ కేంద్రం ద్వారా ఆర్థిక లావాదేవీలు చేస్తున్న గోవింద్

సమస్యల పరిష్కారానికి ముందడుగు..

గోవింద సోదరుడు మీసాల రామునాయుడు పదో తరగతి వరకు చదువుకున్నప్పటికీ గ్రామంలో మిల్క్ డెయిరీ నిర్వహిస్తున్నాడు. తనకున్న జ్ఞానంతోనే గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. గ్రామంలో ఎవరికైనా సమస్యలుంటే ప్రభుత్వం అందించిన మూడు చక్రాల ద్విచక్ర వాహనంతో మండల కేంద్రానికి వచ్చి ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నాడు. మిల్క్ డెయిరీ నడుపుతూ తనకి వచ్చిన ఆదాయంలో కొంచెం నగదుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాడు. మహిళలు, విద్యార్థులకు అవసరమైన సేవలను ఉచితంగా అందిస్తూ వారి మన్ననలను పొందుతున్నాడు. అలాగే ఉపాధి హామీ పథకంలో మేట్‌గా పనిచేస్తున్నాడు. దివ్యాంగులైన ఇద్దరు అన్నదమ్ములు గ్రామస్తులకు అండగా నిలబడడంతో పలువురు అభినందిస్తున్నారు.


అనాథ పిల్లలకు అన్నదానం చేస్తున్న గోవింద్

సేవ చేయడం దేవుడు ఇచ్చిన అదృష్టం

ప్రజలకు సేవ చేయడం. అనాథలకు అన్నదానం చేయడం దేవుడు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నాం. ప్రజలకు సేవ చేయడానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, దమరసింగి యువత ఎంతగానో సహకరించారు. వారి సహకారంతో మరింత సేవ చేస్తాను.

మీసాల గోవింద్ , దివ్యాంగుడు

అందరూ బాగుండాలి..

మనతో పాటు అందరూ బాగుండాలి అనే దృఢ సంకల్పంతో పని చేస్తున్నాం. గ్రామంలో సమస్యలను పరిష్కరించడం, విద్యార్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించడం, డ్వాక్రా మహిళల బ్యాంక్ లావాదేవీల్లో సహకరించడంతో పాటు తోటి దివ్యాంగులకు అండగా ఉంటున్నాను.

-మీసాల రామునాయుడు , దివ్యాంగుడు

పార్వతీపురంలో వైశ్యరాజు జ్యూయలర్స్


వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని పద్మశ్రీ థియేటర్ ఎదురుగా వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్‌ను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ.. పార్వతీపురం, రాయగడ ప్రాంత కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు కొత్త షోరూమ్ ప్రారంభించామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైశ్యరాజు ఫల్గుణ రాజు, వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్ కుమార్‌రాజు, వేంకటేశ్వర జ్యూయలర్స్ ప్రతినిధులు బెలగాం జయబాబు, యిండుపూరు గోపాలరావు, యిండుపూరు గున్నేశ్వరరావు, యిండుపూరు గుంపస్వామి, బరాటం వెంకటరమణమూర్తి, జల్లు రామకృష్ణ పాల్గొన్నారు.

తోటపల్లి పిల్ల కాలువకు గేట్లు


గేట్లు అమర్చుతున్న అధికారులు

తెర్లాం: మండలంలోని తోటపల్లి ప్రధాన కుడి కాలువ నుంచి ఆమిటి పిల్ల కాలువకు సాగునీరు వెళ్లేందుకు అవసరమైన గేట్లను సంబంధిత అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. గతంలో ఆమిటికి సమీపంలో ఏర్పాటు చేసిన గేట్లు పాడవ్వడంతో, వాటికి మరమ్మతులు చేపట్టి మళ్లీ ఏర్పాటు చేశారు. ఇటీవల తోటపల్లి పిల్లకాలువ గండిని పరిశీలించేందుకు వచ్చిన బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) గేట్లకు మరమ్మతులు చేసి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు గేట్లు ఏర్పాటు చేసినట్లు తోటపల్లి ప్రాజెక్ట్ డీఈ, ఏఈ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మన్యం జిల్లా 1998 డీఎస్సీ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షులు కె. రమేష్, బి. ఉమాకామేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నగిరెడ్డి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆర్‌వీ ప్రసాద్, ఎస్. వెంకటనాయుడు, కార్యదర్శిగా కొల్లి రామకృష్ణ, ఉప కార్యదర్శిగా కర్రి అప్పలనాయుడు, ట్రెజరర్‌గా రామచంద్రరావు, జాయింట్ ట్రెజరర్‌గా బొత్స శంకరరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారానిక కృషి చేస్తామన్నారు.

ఎమ్మెల్యే.. వాస్తవాలు తెలుసుకో..

- రూపాయికే టిడ్కో ఇల్లు ఇవ్వాలన్నది జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యం
- కనీస పరిజ్ఞానం లేకుండా ఆరోపణలు చేయడం తగదు
- టిడ్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్


మాట్లాడుతున్న టిడ్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: పేదలకు ఒక్క రూపాయికే ఇల్లు అందించాలన్న తపన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని టిడ్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ, అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్వీర్యం చేసిందన్నారు. 2021లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి టిడ్కో ఇళ్ల పనులపై రివర్స్ టెండరింగ్ చేపట్టి అతి తక్కువ కాలంలోనే 800 ఇళ్లను సేర్‌వాల్ టెక్నాలజీతో పనులు పూర్తి చేశామన్నారు. కేవలం అప్రోచ్ రోడ్డులు, తాగునీటి సౌకర్యం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా పనులు జరగలేదని చెప్పారు. టిడ్కో ఇళ్ల నీటిసరఫరాకు రూ. 6 కోట్లు, మున్సిపాల్టీ నీటి సరఫరాకు రూ.6 కోట్లు వెరసి రూ. 12 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ విషయాలన్నీ తెలుసుకోకుండా, కనీసం అధికారులను అడగకుండా పార్వతీపురం నూతన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.2.60 లక్షలకు టిడ్కో ఇల్లు ఇస్తామని టీడీపీ నాయకులు చెప్పగా.. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి మాత్రం రూపాయికే ఇల్లు ఇచ్చిన విషయం ఎమ్మెల్యే తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరజపాడులో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు-కుదమ పంట పొలాల్లో ఏనుగులు ఆదివారం దర్శనమిచ్చాయి. దీంతో వరినారు పోసిన రైతులు భయాందోళన చెందుతున్నారు. వరినారును ధ్వంసం చేస్తే మళ్లీ విత్తనాలు దొరికే పరిస్థితి లేదని వాపోతున్నారు. అరటి, పామాయిల్ తోటల్లో ఉన్న ఏనుగులు వరి నారు మళ్లలోకి చొచ్చుకువచ్చే అవకాశముందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

11మందికి గాయాలు

- బస్సును, లారీ ఢీకొట్టగా ప్రమాదం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురంటౌన్/సీతానగరం: సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై కాశీపేట గ్రామం వద్ద ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో 11 మంది గాయాలపాలయ్యారు. సాలూరు నుంచి పార్వతీపురం వస్తున్న బస్సును కాశీపేట సమీపంలో వెనుక నుంచి లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొట్టడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఎం.భవాని, ఎం.విజయకుమార్, ఎం.గణేష్, కె.దండాసి, ఎం.పైడితల్లి, హేమలత, ఆర్.ధనలక్ష్మి, ఎస్.సూరమ్మ, రవికుమార్, చందు, సత్యవతిలు ఉన్నారు. ప్రమాద సమాచారం మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు.